మైసమ్మ ఆలయాభివృద్ధికి కృషి

- సొంతంగా రూ.కోటి నిధులు
- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకవర్గం

నవాబ్‌పేట, డిసెంబర్ 26 : ఫతేపూర్ మైసమ్మ ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని, రూ.కోటి సొంత నిధులతో మరిన్ని పనులు చేపడుతామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. గురువారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫతేపూర్ మైసమ్మ ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 13 మంది సభ్యులచే పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైసమ్మ ఆలయం వద్ద అటవీ శాఖ భూమి అభివృద్ధికి ఆటంకంగా మారిందని, అన్ని అడ్డంకులను తొలగించేందుకు సంబంధిత మంత్రితో మాట్లాడినట్లు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గం వృథా ఖర్చులు చేయకుండా తీర్మానం చేయాలన్నారు. దేవాలయాల్లో.. పూజలు, కొబ్బరికాయలు, శాలువాల కోసం అంటూ కోట్లాది రూపాయలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అమ్మవారి డబ్బులతో కొన్న శాలువాలు, దండలు ఎమ్మెల్యేలకు సైతం కప్పవద్దని ఆదేశించారు. అలా చేస్తే సొంత పార్టీ నేతలైనా వదిలిపెట్టనని హెచ్చరించారు. అనంతరం చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి తోపాటు పాలకవర్గ సభ్యులను నాయకులు, కార్యకర్తలు, అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, నాయకులు దుష్యం తిరెడ్డి, నీరటి రాంచంద్రయ్య, వాసుయాదవ్, తుల్సీరాంనాయక్, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలి

కరపత్రలను విడుదల చేస్తున్న హరగోపాల్

మరికల్, డిసెంబర్ 26 : చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని వెంటనే రద్దు చేయాలని సింథటిక్ కెమికల్ కంపెనీ నిర్మాణం పనులు అపాలని కోరుతూ గురువారం చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు డిమాండ్ చేశారు. ఈ కంపెనీ ద్వారా మానవ జీవన విధానం ప్రశ్నార్థకంగా మరుతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. నూతనంగా నిర్మించబోయో మరో రెండు ఇథనాల్ కంపెనీ పనులను ఆపాలని డిమాండ్ చేస్తూ కరపత్రలను విడుదుల చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్ ముదు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి
షూటింగ్ బాల్‌కు ఎంపికైన విద్యార్థులు

జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

మక్తల్, డిసెంబర్ 26 : రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్‌లో నారాయణపేట జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపికైనట్లు షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాలం తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నవంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా బాలబాలికల జట్టు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో క్రీడా నైపుణ్యతను కనబరిచారు. జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు మక్తల్ సంగం బండ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థి కౌసల్య, కోస్గి మండలం ముసిరిఫా పాఠశాల విద్యార్థి జగదీశ్, ధన్వాడ మండలం ఎలుగోడ్ల పాఠశాల విద్యార్థి దుర్గా జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడలకు ఎంపిక య్యారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు, కలకత్తాలో జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయస్థాయి జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన పీటీలను షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి సీహెచ్ బలయ్య అభినందించారు.

సైబర్ క్రైం లో బీహార్‌లో యువకులు అరెస్టు

- రుణాలు ఇప్పిస్తామంటు రూ.5కోట్లు కుచ్చుటోపి

మహ్మదాబాద్, డిసెంబర్ 26 : రుణాలు ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు రూ.5 కోట్లను సామాన్యులతో స్వాహా చేసి ఐదుగురు బీహార్ పాట్నాలో పోలీసులకు పట్టబడ్డారు. అందులో తెలంగాణకు చెందిన నాలుగు యువకులు ఉండగా మహ్మదాబాద్ మండలానికి చెందిన ముగ్గురు యువకులు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. మండలంలో ఓ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బీహార్‌లో వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ రుణాలు ఇప్పిస్తామంటూ అమాయక ప్రజలకు గాలం వేసి సైబర్ ఉచ్చులోకి దించి రూ.కోట్లను అన్‌లైన్ ద్వారా మోసాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Kathalsab Padhabadesab Gajula S/o Padhabadesab, age 43 years, Occ: Business, R/o H.No. 7-132/3, Hanuman wada, Marikal Village & Mandal, Narayanpet Dist. **Applicant / Borrower / Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఇల్లును తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఆక్షేపణలు మరియు క్లెయిములు ఉన్న యెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

The Residential House bearing No.7-132/3, admeasuring 102.50 Sy.Yrds situated at Marikal Village & Mandal, Narayanpet Dist., which is bounded as under: **East:** 2' Seri & House of Gajula China badesab, **West:**2' Seri & Dilapiated House of Gajul Hussainbee, **North:** 7" Road & House of P. Shekar, **South:** 3" Seri & House of Gajula Chinna badesab.

MALLIKARJUN B.A, LL.B.,
Advocate, 1-6-41/12, Satya Sai Colony,
Narayanpet. Cell: 9440393742

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణపేట రూరల్, డిసెంబర్ 26 : ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణపేట, కోస్గి పరిసర ప్రాంతాల ప్రజలకు కోసం నిర్వహించే డైల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు 7382826293 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, తగు సలహాలు, సూచనలను తెలియజేయవచ్చును పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు, సద్వినియోగం చేసుకోగలరని పేర్కొన్నారు.

ఒంటికాలిపై నిలబడి ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

- సమ్మెకు పెరుగుతున్న ఆయా సంఘాల మద్దతు
- విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దు
- బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు



ఎస్ఎస్ఏ ఉద్యోగులకు సంఘీభావం ప్రకటిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, డిసెంబర్ 26 : సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో చేస్తున్న సమ్మె గురువారానికి 17వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు, జీహెచ్ఎం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హేమచంద్రుడు, హిందీ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్, తెలంగాణ ప్రగతిశీల, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సాంబశివుడు, ప్రగతిశీల యువజన సంఘం అధ్యక్షుడు ప్రతాప్, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి, పీఆర్‌టీయూ గోపీకాంత్, యూటీఎఫ్ హేమంత్‌కుమార్, వెంకటయ్య, ఎంఈవో వెంకటాజీ, టిమ్రిస్ షేక్‌మహబూద్, తదితరులు వారికి సంఘీభావం తెలుపుతూ సమ్మెలో బైఠాయించి తమ మద్దతు ప్రకటించారు. బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణుడు మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్, మినిమం టైమ్ స్కేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దని మీ డిమాండ్లు నెరవేరే వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద విద్యార్థులను విద్యకు దూరం చేయొద్దని వెంటనే ఒక నిర్దిష్ట మైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ఒంటికాలిపై నిలబడి నిరసన : సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మెలో భాగంగా గురువారం ఒంటికాలుపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. తమ పిల్లా పాపలతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. చిన్నారులు సైతం ఒంటికాలిపై నిలబడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి వెంటనే స్పందించి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. అనంతరం రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీటీఏ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, జిల్లా కోశాధికారి మల్లేశ్, రాజా పుల్, మండలా ధ్యక్షుడు శివకుమార్, ధనుంజయ, జేఏసీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా మైనొద్దీన్, విక్రమ్, విష్ణు, అన్వర్, వేణుగోపాల్, శ్రీనివాసులు, చెన్నయ్య, కలీం, బాలరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్, డిసెంబర్ 26 : నియోజకవర్గ కేంద్రమైన మక్తల్ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులతో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ పరంగా అన్ని విధాలుగా అర్హత కలిగిన మక్తల్ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్‌కు కోరినట్లు వారు తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మక్తల్ అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

వెలివాడల నుంచి వెలుగుల వైపు

- పేదరికం, కష్టాలు వెంటాడుతున్నా.. చదువే మిన్నగా ముందుకు
- ప్రసిద్ధ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించిన మీసాల జ్ఞానేశ్వర్

డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ జ్ఞానేశ్వర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 26 : చదువే సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సూచించిన మార్గంలో వెలివాడల నుంచి వెలుగుల వైపు పయనించిన ఓ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి నేడు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా సాధించాడు. తల్లిదండ్రులు పడ్డ కష్టానికి ప్రతిఫలం అందించాడు. పాలమూరు విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా విధులు నిర్వర్తిస్తున్న మీసాల జ్ఞానేశ్వర్ 'ఆర్గానిక్ ఛార్జ్ ట్రాన్స్ ఫర్ కాంప్లెక్సెస్ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై యాంటీ క్యాన్సర్ యాక్టివిటీస్ అండ్ డీఎన్ఏ బైండింగ్‌పై గైడ్ టీచర్ ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ డిపార్టుమెంట్ ప్రొఫెసర్ పార్థసారథి పర్యవేక్షణ లో చేసిన పరిశోధనలకు గానూ పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

కష్టాలను అధిగమించి : వీపనగండ్ల మండలం అంబేద్కర్ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబం గంగమ్మ, రాముడు దంపతులకు నలుగురు సంతానం. వారిలో రెండో సంతానం మీసాల జ్ఞానేశ్వర్. ఆయన విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాల, గురుకుల విద్యాలయం, యూనివర్సిటీల్లోనే జరిగింది. 1వ తరగతి నుంచి నాలుగో తరగతి వరకు వీపనగండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగింది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ లింగాలలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయంలో పూర్తి చేశారు. కర్నూల్‌లోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎంఎస్సీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

గురువులే స్ఫూర్తి

చిన్నప్పటి నుంచి చదువంటే చాలా ఇష్టపడేవాన్ని. ఎంతో కష్టపడ్డా.. నాటి పరిస్థితులు గుర్తుచేసుకుంటే కన్నీటి సంద్రమే.! మొత్తం మీద ఏదైతే నేను అనుకున్నానో దాన్ని ఇష్టంతో సాధించా. గురువులను చూసి మోటివేట్ అయ్యా. వారు చూపిన దారిలో ఇన్‌స్పైర్ అయ్యా. అధ్యాపకుడు కావాలని అనుకున్నా. ఆదిశగా నిత్య విద్యార్థిగా ముందుకు సాగుతా. నిరుపేద విద్యార్థులకు అన్ని రకాలుగా అండగా ఉండి వారి విద్యాభ్యున్నతిలో నా వంతుగా సాయం చేస్తా.

- డాక్టర్ జ్ఞానేశ్వర్,
పాలమూరు యూనివర్సిటీ అధ్యాపకుడు

సంకల్ప బలం ఉంటేనే లక్ష్యం సాధించగలం

- పీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య

మహిళల ఖోఖో జట్టుతో వైస్ ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్, కోచ్‌లు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 26: సంకల్ప బలం ఉంటేనే లక్ష్యం సాధించగలమని పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య అన్నారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ, ఆల్ ఇండియా పోటీలకు పీయూ ఖోఖో మహిళల జట్టు గురువారం కాలికట్ యూనివర్సిటీ బయలుదేరింది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ క్రీడాకారులకు ట్రాక్ సూట్, టీమ్ యూనిఫామ్స్ అందజేశారు. క్రీడాకారులు ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసులు, ప్రొఫెసర్ సత్య భాస్కర్‌రెడ్డి, మేనేజర్ తిరుమలేశ్, కోచ్ విజయలక్ష్మి, మొగులయ్య, మన్యం పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో చోరీ

మిడ్జిల్, డిసెంబర్ 26 : మండల కేంద్రంలో బోయిన్‌పల్లిలో గురువారం పట్టపగలే ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి భారీగా నగలు, నగదు దోచుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మునీర్ తాళం వేసి ఉన్న ఇంట్లో 30 తులాల వెండి, తులం బంగారం రూ.33వేలు నగదు, కృష్ణయ్య ఇంట్లో 20 తులల వెండి, రెండు మాసల బంగారం చోరీ జరిగింది. చోరీ జరిగిన ఇండ్లను ఎస్సై శివ నాగేశ్వర్‌నాయుడు పరిశీలించి పంచనామా చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాలీబాల్ ఆడుతున్న యువకులు

ఘనంగా బాక్సింగ్‌డే వేడుకలు

జడ్చర్ల, డిసెంబర్ 26 : బేతని ఎంబీ చర్చి యౌవన కార్యవర్గం ఆధ్వర్యంలో గురువారం బాక్సింగ్‌డేను ఘనంగా నిర్వహించారు. బాక్సింగ్‌డేను పురస్కరించుకొని వాలీబాల్, చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, క్రికెట్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విలియంబూత్, పాస్టర్ స్టివెన్‌రాజ్, చైర్మన్ ఫిలమోన్, కార్యదర్శి తిమోతి, జయపాల్, జాన్సన్, నతానియల్, సీఐ రత్నం, ప్రీతం, గడ్డంసాగర్ పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కృష్ణ, డిసెంబర్ 26 : కారు బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకున్నది. స్థానికులు వివరాల మేరకు మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీ సమీపంలో నేషనల్ హైవే167 రహదారిపై గుడెబల్లూర్ గ్రామానికి చెందిన ముస్క రాము ట్రాక్టరుకు డీజిల్ తేవడానికి పెట్రోల్ బంక్‌కు వెళ్తున్న క్రమంలో కారు అతి వేగంగా వెనుల నుంచి బైక్‌ను ఢీకొన్నది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రాము తలకు బలమైన గాయాలుగా కర్ణాటకలోని రాయచూర్ దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించినట్లు స్థానికులు తెలిపారు.

మూడో స్థానమే లక్ష్యంగా..

- కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

విద్యార్థులతో ముచ్చటిస్తున్న కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్

మక్తల్/నారాయణపేట, డిసెంబర్ 26 : 2028 సంవత్సరం నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడో స్థానంలో ఉండడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం రాయికోడ్ గ్రామ పర్యటనలో భాగంగా బండి సంజయ్ ముఖ్యఅతిథిగా హాజరై సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ బెన్‌సాలాం, శిక్షణ కలెక్టర్ గరిమానరూల స్వాగతం పలికారు. అనంతరం ఆయన పాలమూరు ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి గ్రామంలో డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాయికోడ్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. గ్రామంలో ఉన్న పల్లెదవాఖానను పరిశీలించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్త శుద్ధితో కృషి చేసి విధులు నిర్వర్తించాలని సూచించారు. దేశంలో వెనుక వాడిన ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వాటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని దేశవ్యాప్తంగా 112 జిల్లాల్లో 500 బ్లాక్ మండలాల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే నర్వ మండలం రాయికోడు గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయి పర్యటన చేపట్టినట్లు తెలిపారు. మంత్రి బండి సంజయ్ కుమార్‌కు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నారాయణపేట జిల్లాకు నవోదయ పాఠశాలలను మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం పేట జిల్లా కేంద్రాన్ని సందర్శించగా కలెక్టర్ కార్యాలయంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని బీకేఎస్ జోనల్ కార్యదర్శి వెంకోబా మంత్రి బండిసంజయ్ కుమార్‌ను కోరారు. రైతులు పండించిన పంటలకు ఫసల్ బీమా అమలు కావడం లేదని, కిసాన్ క్రెడిట్ కార్డులు, డైరీ ఫామ్‌లు, పీఎంఈజీపీ రుణ సదుపాయం అమలయ్యేలా చూడాలని కోరుతూ బీకేఎస్ నాయకులు వినతి పత్రం సమర్పించారు.

28న ఉమ్మడి జిల్లా
ఖోఖో జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 26 : ఉమ్మడి మహబూబ్‌నగర్ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉమ్మడి జిల్లా సీనియర్స్ బాల, బాలికలకు ఖోఖో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విలియం గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంపిక యయ్యే క్రీడాకారులు వచ్చే ఏడాది జనవరి 8 నుంచి 10వ తేదీ వరకు వరంగల్ జిల్లా హన్మకొండలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9985023847, 9951313615 నెంబర్లను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

రైతులను చిన్నచూపు చూస్తుంది

రైతులను సన్మానిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

మరికల్, డిసెంబర్ 26 : ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు దరలు నిర్ణయించకపోతుందని మిటని ప్రొఫెసర్ హరగోపాల్ ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని ఓ విద్యామందిర్‌లో నిర్వహించిన రైతు సదస్సుకు హరగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం స్వామినాథన్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో కొంతమంది రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమానికి ఏ ప్రభుత్వం కూడా కృషి చేయడంలేదన్నారు. యువ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అనంతరం యువ రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ వీనితమ్మ, పూర్ణిమా, లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు

మైదానానికి పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 26 జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో శుక్రవారం నుంచి సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాసులు తెలిపారు.లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగే ఈపోటీలు ఈనెల 27 నుంచి 30వ తేదిన వరకు బాల,బాలికలకు కబడీ,31 నుంచి వచ్చె నెల జనవరి 2వ తేది వరకు నెట్‌బాల్ టోర్నమెంట్ ఉంటాయన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైయే ఈపోటీలకు ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర క్రీడాల వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి,ఎంపి డీకే అరుణ,ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి,అనురుద్‌రెడ్డి,ముధుసూదన్‌రెడ్డి, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఒబుదుల్లా కొత్వాల్ హాజరవుతారని తెలిపారు.

నాగర్‌కర్నూల్‌లో పీజీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 26 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలను పాలమూరు యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ జీఎన్. శ్రీనివాస్ గురువారం ఎంపీ మల్లురవికి అందించారు. యూనివర్సిటీలో జరిగే పలు అభివృద్ధి పనులు, కార్యక్రమాలను వివరించారు. పాలమూరు వర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణలో తోడ్పాటు అందించాలని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ అనుమతులు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.